# గీత - పాలనాదక్షత -5

- యేలూరిపాటి ఆంజనేయశర్మ

అర్జునిడింకా ఇలా అంటున్నాడు.

"న కాంక్షే విజయం కృష్ణ ! న చ రాజ్యం సుఖాని చ!

కిం నో రాజ్యేన గోవింద! కిం భోగై ర్జీవితేన వా "

కృష్ణా నాకు విజయం అక్కర్లేదు, రాజ్యం-సుఖం ఏమీ అక్కర్లేదు (వీళ్ళందర్నీ చంపుకున్నాక) నాకు రాజ్యమెందుకు? భోగమెందుకు? అసలు జీవితమెందుకు?"

ప్రస్తుతం చేయలేకపోతున్న పనిని చెయ్యక్కర్లేనిదిగా చెప్పటం అతితెలివి లక్షణం. కృష్ణుడంతటివానిముందు దీనినే ప్రదర్శించాడు అర్జునుడు. లోకంలో చాలామంది 'ఫలానా పని మీరు చేయలేదేం?' అంటే 'ఆ మనకెందుకండీ' అంటారు తప్ప చేయలేమని ఒప్పుకోరు.

ఇంతకీ ఏమీ అక్కర్లేదు అనుకునే అర్జునుడు యుద్ధరంగం దాక ఎందుకొచ్చినట్టు? తీరా వచ్చాక తన వాళ్ళంతా చావబోతున్నారని తెలిశాక ఎందుకనిపిస్తోందన్నమాట. రక్తపాతం లేకుండా రాజ్యం వస్తే సిద్ధమేనన్నమాట తీసికోవటానికి. ఇక్కడింకో రహస్యమున్నది. "యుద్ధలక్ష్యాలు" గా రాజ్యం-తదితర భోగాలనే భావించాడనేది. కనుక యుద్ధఫలితాలైన వాటిని అక్కర్లేదనుకున్నాడు.

నిజానికి యుద్ధఫలం ధర్మసంరక్షణమే. దానికి మార్గం దుష్టశిక్షణ-శిష్టరక్షణ. అందుకై యుద్ధం అవశ్యాచరణీయం. కనుక ముందుగా అర్జునునికి యుద్ధలక్ష్యం సరిగా ఎరుక పరచాల్సివుంది. యుద్ధానికి పరమ ప్రయోజనం పాండవుల భోగభాగ్యాల పునరుత్థనం కాదు. అధర్మంపై ధర్మవిజయం శాశ్వతమనీ, తప్పదనీ ఉన్న ప్రకృతి ధర్మాన్ని స్థిరపరచటం. మానవుల్లో ధర్మాధర్మ విచక్షణ కల్గించటం, ధర్మాచరణకు ప్రేరేపించటం. అధర్మానెదిరించే వీరత్వాన్ని నింపటం గీతా లక్షం. అదే యుద్ధఫలం.

అర్జునుడింకా యుద్ధలక్ష్యాన్ని సమితం చేసికొన్నాడనటానికి నిదర్శనం 'ఎవరికోసం నేను రాజ్యాన్ని, భోగాలను సుఖాలను కోరుకున్నానో, వారు ప్రాణాలొదలటానికి సిద్ధంగా ఉన్నారు. ఆచార్యులు, తండ్రులు, కుమారులు, తాతలు, మేనమామలు, మనుమలు, బావమరదులు, బంధువులు అంతా ఉన్నారు'.

అర్జునుడు మరీ దుర్యోధనుడిలా 'తన' కోసం ఇతరులను బలిపెట్టే స్వార్థపరుడు కాదు. "మదర్థే" వంటి మాటలనలేదు. కాని తాను 'తన' వాళ్ళకోసం యుద్ధం చేయాలనుకొంటున్నాడు. తాను తెగించి యుద్ధం చేసేది తనవాళ్ళ భోగభాగ్యాలకోసమని అర్జునుని భావన. 'తాను సాధించినదానిని అనుభవించేవాళ్ళు లేకపోయాక ఇకెందుకీ సంపాదన? ఎవరికోసం యుద్ధం?' అని ఆయన తపన. దుర్యోధనునితో పోలిస్తే అర్జునుని లక్ష్యం విస్తృతమే అయినా, అపరిమితమేమీ కాదు. ధర్మసంస్థాపనా లక్ష్యం కానించదలిచాడు శ్రీకృష్ణుడు.

ఇక్కడ మనం గమనించవలసింది మరొకటుంది. కార్యకర్త స్థాయినిబట్టి లక్ష్యస్థాపన-వివరణ ఉండవచ్చు. ధర్మజుని సైన్యమంతా ధర్మపోరాటంగా యుద్ధాన్ని భావించారనలేము. అర్జునునికే లక్ష్యం పట్ల స్పష్టతలేనపుడు అనుయాయులకుంటుందని ఎలా అనుకుంటాము? కనీసం నాయకత్వానికి ఇది ధర్మపోరాటమనే స్పష్టత ఉంటే, తాము ధర్మంకోసం ఉన్నామన్న స్పష్టమైన కల్పనను అనుయాయులకివ్వ గల్గుతాడు.

ధర్మాన్ని స్పష్టంగా ప్రతీ సైనికుడు నిర్వచించలేకపోయినా తన నాయకుడు మంచికోసం, ధర్మంకోసం, న్యాయంకోసం అంకితమవుతాడన్న నమ్మకం కుదిరితే తాను మనస్ఫూర్తిగా పనిచేస్తాడు. కనుక ఏడు అక్షౌహిణుల సేనకు స్పష్టమైన కల్పన సైన్యానికి నైతికంగా నాయకత్వం వహిస్తున్న (సైన్యాధ్యక్షుడు ధృష్టద్యుమ్నుడైనా , వెన్ను-దన్ను పార్థుడే కనుక) అర్జునుణ్ణి ఆదర్శంగా మలచటానికే భగవంతుని గీత.